మూగ జీవాల ఆకలి కేకలు

ఎవరికీ పట్టని ఆవేదన!

- కుక్కల శస్త్ర చికిత్సాలయంలో ఆకలితో అలమటిస్తున్న వీధికుక్కలు
- మొరుగుతున్నా పట్టించుకోని సంస్థ నిర్వాహకులు
- అరుస్తున్న వాటిని చావబాదుతున్న సంరక్షకుడు



బుర్రిపాలెం రోడ్డులోని కుక్కల శస్త్ర చికిత్సాలయం



బోన్‌లో ఉన్న కుక్కలు



కుక్కలకు పెట్టే అన్నం ఇదే

తెనాలిఅర్బన్: మూగజీవాల రోదన వర్ణనాతీతంగా మారింది. కుక్కల నియంత్రణకు తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న శస్త్రచికిత్సలు వీధి కుక్కల పాలిట శాపంగా మారింది. వీటిని పట్టుకుని కుక్కల శస్త్ర చికిత్సాలయానికి తీసుకువచ్చి వాటి ఆలనా పాలనను విస్మరిస్తున్నారు. దీంతో అవి ఆకలితో నిత్యం మొరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా వాటిని సంరక్షించే వారు కరువవటం పలు విమర్శలకు తావిస్తోంది.

మున్సిపల్ అధికారుల లెక్కల ప్రకారం తెనాలి పట్టణంలో 1500 వరకు వీధి కుక్కలు ఉన్నాయి. వీటి నియంత్రణ కోసం బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో గతంలో కుక్కల శస్త్ర చికిత్సాలయాన్ని నిర్మించి దానిలో సంతానోత్పత్తి నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తూ వచ్చారు. ఇప్పటి వరకు అధికారులు లెక్కల ప్రకారం 1000 కుక్కలకు శస్త్ర చికిత్సలు చేశారు. మిగిలిన కుక్కలకు శస్త్రచికిత్సలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

తెనాలిలో చికిత్సాలయం

వీధి కుక్కల నియంత్రణ చర్యలలో భాగంగా తెనాలిలో గతంలో మున్సిపల్ నిధులతో శస్త్ర చికిత్సాలయాన్ని బుర్రిపాలెం రోడ్డు కంపోస్ట్ యార్డులో నిర్మించారు. దీనికోసం కుక్కలను ఉంచేందుకు ఒక షెడ్‌ను నిర్మించారు. దానిలో 97 (బోన్‌లు) ఏర్పాటు చేశారు. దాని ప్రక్కన ఆపరేషన్ చేసేందుకు అవసరమైన గదులతో కూడిన షెడ్‌ను నిర్మించారు.

నిబంధనలకు నీళ్లు

రాష్ట్రంలోని వీధికుక్కల నియంత్రణ చర్యలలో భాగంగా స్నే అనే సంస్థకు శస్త్ర చికిత్సలు చేసే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. స్నే సంస్థ నిర్వాహకులు పట్టణంలోని వీధి కుక్కలను పట్టుకుని ప్రత్యేక వాహనంలో శస్త్ర చికిత్సాలయానికి తీసుకువస్తారు. వాటికి మత్తు ఇచ్చి సంతానోత్పత్తిని నియంత్రించే శస్త్ర చిక్సితను చేస్తారు. నాలుగు రోజులు వాటికి యాంటీబయోటిక్‌తో మందులతోపాటు వ్యాక్సిన్‌లు వేస్తారు. అలాగే వాటికి నాలుగు రోజులు అవసరమైన ఆహారాన్ని నిర్వాహకులు అందిస్తారు. తర్వాత వాటిని పట్టుకున్న ప్రాంతంలో వదిలేసి వస్తారు.

వెంటనే చర్యలు చేపడతా



తెనాలిలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా వాటిని పట్టుకుని తీసుకువచ్చి వాటికి శస్త్ర చికిత్సలు చేసే బాధ్యతను స్నే సంస్థకు అప్పగించాం. వాటి అలనా, పాలనా వారే చూడాలి. ఇప్పుడే విషయం తెలిసింది. వెంటనే అక్కడికి వెళ్లి కుక్కలకు నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

–వీఎం లక్ష్మిపతిరావు, అసిస్టెంట్ కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

పట్టుకొచ్చి... పట్టించుకోవడం మానేశారు!

అయితే తెనాలిలో రెండు రోజుల క్రితం సుమారు 25 వీధి కుక్కలను పట్టుకుని వచ్చారు. వాటికి శస్త్రచిక్సిలు చేసే బోన్లలో బంధించారు. కానీ వాటికి ఎటువంటి ఆహారాన్ని అందించడం లేదు. సాయంత్రం వేళలో మాత్రమే నీళ్లతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిసింది. దీంతో అవి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకలితో అలమటిస్తు.. మొరుగుతూ ఉన్నాయి. అంతేకాకుండా వాటి సంరక్షణ కోసం సంస్థ నియమించిన వ్యక్తి అరుస్తున్న కుక్కలను కొట్టడం వల్ల అవి గాయాలతో కన్పించాయి. ఇంత జరుగుతున్నా వాటి గురించి పట్టించుకునే వారు కరువయ్యారనే చెప్పవచ్చు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

జీవో నెంబర్ 5ను రద్దు చేయాలి



తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల కోసం జారీ చేసిన జీవో నెంబర్ 5 ను రద్దు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు శనివారం తెనాలిలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. అలాగే సబ్ కలెక్టర్ సంజన సింహాకు కూడా వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

'కార్పొరేట్లకు వరాలు - పేదలకు శాపాలు' పుస్తకావిష్కరణ



తాడేపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏడాది పాలనా వైఫల్యాలపై సీపీఎం రచించిన 'కార్పొరేట్లకు వరాలు – పేదలకు శాపాలు' పుస్తక ఆవిష్కరణ శనివారం తాడేపల్లిలో జరిగింది. తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేటలో జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలను ఈ పుస్తకంలో పొందుపరిచామన్నారు. నాయకులు డీవీ భాస్కరరెడ్డి, వై.బర్నబాస్, బొబ్బిలి రామారావు, నీరుడు దుర్గారావు, ఎస్‌కె బాషా, కె.మేరీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు అన్నారు. మండలకేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు దరిచేరవని చెప్పారు. తడి,పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఏఓ ఏకే బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు కోసం.. గిరిజన పిల్లలకు కష్టాలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర ప్రభుత్వం గొప్పల కోసం, ప్రధాని మెప్పు కోసం, మరీ ముఖ్యంగా గిన్నిస్ రికార్డు కోసం వేల మంది గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేశారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మండిపడ్డారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల నుంచి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టల్స్ నుంచి యోగాంధ్ర కార్యక్రమానికి అర్ధరాత్రి 2 గంటలకు బస్సులో తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, అజయ్, వెంకీ, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి



ప్రత్తిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రావూరు పరమేశ్వరరావు, గోరంట్ల రత్తయ్య, మండలపు సాయిబాబులు తమ గేదెలను మేత కోసం శుక్రవారం బయటకు వదిలారు. అయితే ఎప్పటిలా గేదెలు రాత్రి ఇంటికి రాలేదు. శనివారం ఉదయం గుంటూరు – పర్చూరు పాతమద్రాసు రోడ్డుపై కోయవారిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు సమీపంలో మృతి చెంది పడి ఉన్నాయి. విషయం తెలుసుకున్న పశుపోషకులు ఘటనా స్థలానికి చేరుకుని గేదెలు తమవేనని నిర్ధారించుకున్నారు. అనంతరం విషయం వీఆర్వో రాణికు తెలియడంతో ఆమె గేదెల యజమానుల నుంచి వివరాలను సేకరించి, స్టేట్ మెంట్ తీసుకున్నారు. మృతి చెందిన గేదెల్లో రెండు పాలు ఇచ్చే గేదెలు కాగా, ఒకటి చూడి గేదె అని పోషకులు చెబుతున్నారు. రెండు మూడు రోజుల్లో గేదె ఈననున్నదని ఈ లోపే ఇలా జరిగిందని వాపోతున్నారు. ఒక్కో గేదె విలువ రూ.లక్ష నుంచి లక్షన్నర వరకూ ఉంటుందని చెప్పారు.

యోగా నిత్య జీవితంలో భాగం కావాలి



యోగా చేస్తున్న మంత్రి మనోహర్, సబ్ కలెక్టర్ సంజన సింహ, చైర్‌పర్సన్ రాధిక

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలిఅర్బన్: ప్రతి మనిషి జీవితంలో యోగా భాగం కావాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద శనివారం ఉదయం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని యోగా చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పలువురు పీడీలు అందరితో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ యోగా మన సాంస్కృతిలో భాగమని, ఇది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. సబ్‌కలెక్టర్ సంజన సింహా, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు మాట్లాడుతూ యోగా చేయడం వలన మానసిక రుగ్మతులు తొలగిపోతాయని చెప్పారు. అనంతరం యోగా చేసిన వృద్ధులను, చైర్‌పర్సన్ రాధిక, మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు దాసరి వీర వసంతరావు, గోగిరెడ్డి మానసరెడ్డి, కొత్రపాటి లక్ష్మి, బోయపాటి అరుణ, గుంటూరు కోటేశ్వరరావు, అన్నం పిన్నారావు, తహశీల్దార్ గోపాలకృష్ణ, ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, ఎసీపీ శివన్నారాయణ, ఎంఈవో లక్ష్మీనారాయణ, డీఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

తెనాలి: పట్టణ కొల్లూరువారి వీధిలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో శనివారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెనుగొండలోని శ్రీవాసవీ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) స్వయంగా యోగాసనాలను వేశారు.

తెనాలి: స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం చేశారు. యోగా గురువు కోడూరు మల్లికార్జునరావు విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జి.వెంకటేశ్వరరావు విద్యార్థులచే యోగాసనాలు, సూర్యనమస్కారాలు చేయించారు. సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు, కార్యదర్శి కోడూరు రమాదేవి మాట్లాడారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్

తెనాలిటౌన్: భూగర్భ జలాల సంరక్షణకు వర్షపు నీటిని ఒడిసి పట్టాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్ సూచించారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో శనివారం స్వచ్ఛంధ్ర – స్వర్ణంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్ పాల్గొని నీరు–మీరు ఆవశ్యకతను గ్రామస్తులకు తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రతినెల మూడోవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా శనివారం నీరు–మీరు ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పంచాయతీ కార్యాలయం పరిసరాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇంకుడుగుంత ఏర్పాటుకు ప్రభుత్వం లబ్ధిదారులు రూ.6 వేలు నగదుసాయం అందిస్తుందని వెల్లడించారు. ఎన్ఆర్‌ఈజీఎస్ నిదులు కింద ఈ నగదు చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రజలు ఇంకుడు గుంతల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దూళ్ళిపాళ్ళ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి హేమకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి గొడవల నేపథ్యంలో దాడి

- తాడేపల్లి సలాం హోటల్ సెంటర్‌లో దారుణం
- బాధితుడి ఇంటిపై దాడి.. ఇల్లు పాక్షికంగా ధ్వంసం
- ఆపై కుటుంబ సభ్యులపై దాడి
- ప్రాణాలు అరచేతిలో పట్టుకుని పరుగులు తీసిన కుటుంబ సభ్యులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలోని సలాం హోటల్ సెంటర్‌లో శనివారం దారుణం చోటు చేసుకుంది. బాధితుడు వేముల వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. తనకు తన పెదనాన్న కుమారులకు ఆస్తి గొడవలున్నాయని, పాత ఆస్తి గొడవల వివాదం కొనసాగుతుండగా శనివారం తన పెదనాన్న కుమారులు వేముల రమణబాబు, వెంకటేశ్వరరావు, మోహనరావు, శ్రీను శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా తన ఇంటిపై దాడిచేసి ఇంటిపై కప్పురేకులను సైతం ధ్వంసం చేశారన్నారు. కుటుంబసభ్యులపై దాడి చేయడమే కాక భయంతో పరుగులు పెట్టిన కుటుంబసభ్యులను వెంటాడి దాడి చేశారన్నారు. తన తాతకు ఇద్దరు కుమారులు కాగా ఇద్దరికి 12 సెంట్ల స్థలం ఇచ్చారన్నారు. అయితే తనకు ఇచ్చిన స్థలాన్ని విక్రయించిన తన పెదనాన్న కుమారులు తన నివాసంలో వాటా కావాలంటూ శనివారం మధ్యాహ్నం భోజనం చేస్తుండగా ఒక్కసారిగా ఇంటిపై దాడి చేయడంతో తాము భయంతో పరుగులు తీసి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నామని తెలిపారు. అనంతరం గాయాలతో ఆసుపత్రిలో చేరగా ఆసుపత్రి వద్దకు సైతం వచ్చి దాడి చేశారన్నారు. పోలీసులు చేరుకుని వారిలో ఒకరిని అదుపులోకి తీసుకోవడంతో తాను ప్రాణాలతో బయటపడ్డామన్నారు. అయితే ఆ వ్యక్తి పోలీసుల నుంచి పారిపోవడంతో తమకు ఆందోళనగా వుందన్నారు. గతంలోను అనేకసార్లు కేసులు పెట్టినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం కారణంగానే తమపై దాడికి దిగుతున్నారన్నారు. తిరిగి తమపైనే కేసు పెట్టారన్నారు.

జనరల్ సర్జరీ విభాగ అధిపతిగా డాక్టర్ కిరణ్‌కుమార్



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగాధిపతిగా డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ శనివారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్ సర్జరీ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ జి.పద్మశ్రీ సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ రంగనాయక మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో సర్జరీ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను విభాగాధిపతిగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నాద బిందువులు రెండో భాగం గ్రంథావిష్కరణ

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం రెండో వీధిలోని శ్రీత్యాగరాజ కళావేదికపై శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నాద బిందువులు రెండో భాగం గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో జరగ్గా, నాట్య కళారత్న డాక్టర్ కాజా సుబ్రహ్మణ్యం సభాధ్యక్షత వహించారు. గ్రంథావిష్కరణకర్తగా కేంద్ర సంగీత నాటక అకాడమీ, సభ్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, గ్రంథకర్త, వేమూరి రామలక్ష్మి, శ్రీ త్యాగ రాజ సాంస్కృతిక సంఘం సలహాదారులు నేతి విశ్వేశ్వరరావు మాట్లాడారు. అనంతరం కాజా సుబ్రహ్మణ్యం శిష్యురాలు షన్విక గణపతి కౌతం రామ కోదండరామ కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. నాద బిందువులు రెండో భాగంలోని విశేషాలను వక్తలు వివరించారు. కార్యక్రమంలో భూసురపల్లి వెంకటేశ్వర్లు, నాట్యాచార్య బాలు, పెద్ది సాంబశివరావు, మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

ఆర్డీ కార్యాలయ సూపరింటెండెంట్లుగా..

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం సూపరింటెండెంట్లుగా గుంటూరు మలేరియా ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న డి.సత్యం, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఎస్.రామకృష్ణ శనివారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా శుక్రవారం వీరు ఆర్డీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆర్డీ కార్యాలయంలో సూపరింటెండెంట్లుగా పనిచేస్తున్న షేక్ నాగూర్ షరీఫ్, గుంటూరు మెడికల్ కాలేజ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్ బాపట్ల డీఎంహెచ్ సూపరింటెండెంట్ ఆర్డీ కార్యాలయం నుంచి రిలీవ్ అయి విధుల్లో చేరారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్

లక్ష్మీపురం: కూటమి ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు భృతి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి డిమాండ్ చేశారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్ గోడ పత్రిను శనివారం ఆవిష్కరించారు. ఆయన మట్లాడుతూ నిరుద్యోగ యువతకు నెలకి రూ.3 వేలు చొప్పన భృతి చెల్లిస్తామని నారా చంద్రబాబు చెప్పిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి అమరావతిని ఫ్రిజోన్‌గా ప్రకటించి 26 జిల్లాల నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీపురం: రాష్ట్రంలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎన్నికల హామీ మేరకు తక్షణం ఇవ్వాలని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు(సంగమ్) శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు ఇవ్వని కారణంగా 2024 జూన్ మాసం నుంచి ప్రతినెల మూడు వేల రూపాయలు ఇవ్వాలని కమ్యూనిస్టు ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

విత్తన ఎంపిక ప్రధానం

ఏవో శ్రీనివాస్‌రెడ్డి



కొల్లిపరలో వరి విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కొల్లిపర: తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. దీంతో శనివారం మండల వ్యవయాధికారి ఎస్.శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని తూములూరు, కొల్లిపర, వల్లభాపురం, మున్నంగి, అత్తోట తదితర గ్రామాలలోని వరి విత్తనాలు అమ్మే దుకాణాల సిబ్బందితో కలసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించి విత్తన డీలర్లకు, వరి విత్తనాలు కొనేందుకు సిద్ధమవుతున్న రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. రైతులు విత్తన ఎంపిక ప్రధానమని, నాణ్యమైన విత్తనాలతోనే చీడ పీడలు ఆశించకుండా అధిక లాభాలు సాధ్యమని తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఎరువులు, విత్తనాలు అమ్ముతున్నట్లు రైతులు దృష్టికి వస్తే వెంటనే వ్యవసాయాధికారులకు తెలియజేయాలి అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ప్రధానంగా విత్తన ఎంపిక, కొనుగోలు సమయంలో రైతులు కింద తెలిపిన సూచనలు తప్పకుండా పాటించాలని తెలిపారు.

లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. రసీదు తీసుకోవాలి, రసీదు మీద ప్యాకెట్, ల్యాబ్ నంబర్ ఉన్నదీ, లేనిదీ చూసుకోవాలి.

- సాగు చేసే ముందు విత్తనాలను విత్తనశుద్ధి చేయాలని, దీనివల్ల తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చు
- విత్తనాలు కొనుగోలు చేశాక మొలక శాతం పరీక్షించాలి. మొలక శాతం 80 శాతం ఉండాలి.
- పొలంలో విత్తనాలు వేసిన నాటి నుంచి పంట ఇంటికి వచ్చే వరకు విత్తనాలకు సంబంధించిన రశీదులు దగ్గర ఉంచుకోవాలి. రైతుకు ఏదైనా నష్టం జరిగితే అవి ఉపయోగపతాయి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయరాదు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, డబ్బాలపై సీల్ ఉందా? కాలం చెల్లుబాటు ఉందా ? లేదా ? అన్నది నిర్ధారించుకోవాలి
- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో ఎటువంటి లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా రావినూతల శ్రీరామమూర్తి జయంతి



నిత్యావసరాల పంపిణీ చేస్తున్న సభ్యులు

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురుకు చెందిన ప్రముఖ కవి, రచయిత, నటుడు రావినూతల శ్రీరామమూర్తి 74వ జయంతిని శనివారం ఇక్కడి తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. రావినూతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద కళాకారులకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సభకు రంగస్థల కళాకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. తెనాలికి తొలి నంది బహుమతిని తీసుకొచ్చిన దర్శకుడు శ్రీరామమూర్తి అని ఆయన గుర్తుచేశారు. తెనాలి మాజీ జడ్పీటీసీ శాఖమూరి నారాయణప్రసాద్ (చిన్నా), గణేష్ యూత్ వీరవల్లి మురళి, డాక్టర్ కడియాల వెంకటరమణ తమ ప్రసంగంలో శ్రీరామమూర్తి వ్యక్తిత్వాన్ని, గుణగణాలను కొనియాడారు. అంగలకుదురు గ్రామ ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, ఫౌండేషన్ సభ్యులు ప్రకాష్, అన్నపూర్ణ, అనిరుధ్, శివప్రసాద్, రాజేష్‌చౌదరి, కనపర్తి మధుకర్, కళాకారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన



క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పి.శాంతకుమారి

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం క్షయవ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి మండల క్షయ వైద్యాధికారి డాక్టర్ పి.శాంతకుమారి మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించామని తెలిపారు. పొగతాగేవారు, ఆల్కహాల్ సేవించే వారు, మధుమేహ వ్యాధి గ్రస్తులు, గతంలో టి.బి. మందులు గతంలో వాడిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

రెండు వారాలకుమించి దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం, దగ్గులో కళ్లె పడడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. వర్షాకాలం సమీపిస్తోందని, ప్రజలు అందరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. 5 సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు సకాలంలో వేయించాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం అభినందనీయం

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: అమెరికాలో నివసిస్తున్నప్పటికీ సొంతూరుపై మమకారంతో పేదలకు వైద్య సేవలందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. శనివారం పట్టణంలోని భావనాఋషి స్వామివార్ల దేవస్థానం దామర్ల నాంచారమ్మ ప్రాంగణ మండపంలో చిల్లపల్లి అమరయ్య సేవా ట్రస్టు వ్యవస్థాపకులు, శంకర నేత్రాలయ సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి నిర్వాహకుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'కోల్డ్‌స్టోరేజీ' బాధితులకు నగదు పంపిణీకి కమిటీ

తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వ్యాపారులు

దుగ్గిరాల: నెలాఖరులోగా పసుపు కోల్డ్‌స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధితులకు నగదు పంపిణీకి కమిటీ ఏర్పాటు చేసినట్లు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా తెలిపారు. శనివారం దుగ్గిరాల పసుపు యార్డులో నూతన కమిటీ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశామని, రూ. 35.47 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నష్టపోయిన వారికి వారం రోజుల్లో నగదు పంపిణీ చేయనన్నట్లు తెలిపారు. వ్యాపారులు తమకు కూడా రైతులతో పాటు పరిహారం ఇవ్వాలని వినతి పత్రం అందించారు, తహసీల్దారు ఐ.సునీత, సెక్రెటరీ జె.వి.సుబ్బారావు, వ్యాపారులు రవీంద్ర నాద్, శ్రీనివాస రావు, నాగార్జున, రంగయ్య, రాంపుల్లయ్య, ప్రసాద్, రవి, తదితరులు పాల్గొన్నారు.